క్లుప్తంగా

నేడు మద్యం, మాంసపు విక్రయాలు నిషేధం

గాలివీడు : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు మద్యం విక్రయించడం నిషేధమని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పండుగైన స్వాతంత్ర్య దినోత్సవం రోజు నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం నుంచి మద్యం దుకాణాలు, బార్లు పూర్తిగా మూసివేయాలన్నారు. అలాగే చికెన్ దుకాణాలు విక్రయాలు జరపరాదని తెలియజేశారు.

హాస్టల్ తనిఖీ


సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

రాయచోటి టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బాలికల వసతి గృహాన్ని రాయచోటి మున్సిపల్ కమిషనర్ జి.రవికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో కలసి వారి సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనాలు అందించాలని అధికారులకు సూచించారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని విద్యార్థులకు సూచించారు.

పూజల్లో పాల్గొన్న కొరముట్ల

ఓబులవారిపల్లె : వైకోట పంచాయతీ సున్నపురాళ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగురాజు వెంకటరమణరాజు ఇంటి వద్ద గురువారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణరాజు మాజీ ఎమ్మెల్యే కొరముట్లకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హేమనవర్మ, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శివారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు తనిఖీ

పెనగలూరు : సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన గురువారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వారు రికార్డులను పరిశీలించారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు సూచించారు. తదుపరి తహసీల్దార్ కార్యాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, తహసీల్దార్ అమరేశ్వరీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలనకు చరమగీతం పాడుదాం


గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజంపేట రూరల్ : ఒంగోలులో ఆగస్టు 23వ తేదీ నిర్వహించే సీపీఐ 28వ రాష్ట్ర మహసభలను జయప్రదం చేసుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం మహసభల గోడపత్రాలను సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పాలనకు చరమగీతం పాడి ప్రత్యామ్నాయ రాజకీయాల దిశగా, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా మహసభలు వేదిక కాబోతున్నట్లు తెలియజేశారు. మహసభలలో కార్మికులు తరలివచ్చి సంఘీబావం తెలిపాలని కోరారు. కార్యక్రమంలో ఎం.శివారామకృష్ణదేవర, ఇ.సికిందర్, గాలిచంద్ర, నాగేశ్వరరావు, కె.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



మదనపల్లె: బ్రహ్మకమలాలు ఓ ఇంట్లో విరబూశాయి. స్థానిక బైపాస్‌రోడ్డులో నివాసముంటున్న మనిగే భాస్కర్‌నాయుడు ఇంట్లో బ్రహ్మ కమలాలు విరబూశాయి. బుధవారం రాత్రి చెట్టుకు పదులసంఖ్యలో కమలాలు పూశాయి. బ్రహ్మకమలం వికసించడం చాలా అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. బ్రహ్మకమలాలు చూడటానికి పట్టణంలోని ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేశారు.

కోలాటం రిహార్సల్



పెనగలూరు : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన పెనగలూరులోని ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాలలో విద్యార్థులతో కోలాటాన్ని నేర్పించారు. గత కొద్ది రోజులుగా ప్రత్యేకంగా కోలాటం రిహార్సల్స్ చేయిస్తున్నారు. విద్యార్థులు వేసే ఈ కోలాటం అందరినీ ఆకట్టుకుంది.

లాభదాయకం.. గ్రాసం పెంపకం

- సూచనల పాటింపుతో పాడి రైతులకు ఆదాయం
- మిశ్రమ పంటలతో నాణ్యమైన గ్రాసం


రాయచోటి మండలంలో సాగులో ఉన్న పశుగ్రాసం

రాయచోటి జగదాంబసెంటర్ : పాడి రైతులకు పశుగ్రాస పెంపకం లాభదాయకంగా మారుతోంది. ఒక్కో పాడి పశువుకు రోజుకు 30 నుంచి 40 కిలోల మేత అవసరం. ఒక వంతు పప్పుజాతి, రెండు వంతులు ధాన్యపు జాతి గ్రాసాలు అందిస్తే పాల దిగుబడి పెరగడంతో పాటు ప్రస్తుత సీజన్‌లో పశువులకు మేలని పశు సంవర్ధక శాఖ అధికారులు తెలుపుతున్నారు. పశుగ్రాసం పెంపకంలో పాటించాల్సిన మెలకువలపై పాడి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతు ఏ పంట సాగు చేసినా ఖర్చుతో కూడుకున్న పనే. ఏటా రెండు పంటలు సాగు చేసినా ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలకు మించిరాదు. అదే గ్రాసం ఎకరా సాగు చేసి 4, 5 పాడి ఆవుల పెంపకం చేపడితే నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. పశువులకు పచ్చిమేత పుష్కలంగా అందిస్తే 5 లీటర్ల నుంచి 10 లీటర్ల వరకు పాల దిగుబడి పొందవచ్చు. ధాన్యపు జాతి పశుగ్రాసాల సాగుకు యూరియా వాడకంతో దిగుబడి ఎక్కువగా లభిస్తుంది. పూత దశలో కోసి పశువులకు వేయడం మంచిది.

పప్పుజాతి పశుగ్రాసాలతో..

పప్పుజాతి పశుగ్రాసాల సాగు వల్ల నత్రజని భూమిలో వృద్ధి చెందుతుంది. భూసారం పెరగడంతో పాటు నేలకోతను అరికట్టవచ్చు. నీటితడుల సాగులో నత్రజని వంటి సూపర్ పాస్పేట్ వంటి ఎరువులు వేయాల్సి ఉంటుంది. ఎకరం పొలంలో జనుము సాగు వల్ల 40 కిలోలు, అలసంద సాగుతో 30 కిలోలు, లూషర్న్ సాగుతో 20 కిలోలు, సుబాబుల్ సాగుతో 50 కిలోల నత్రజని సమకూరుతుంది. పశువులకు ధాన్యపు జాతి, పప్పుజాతి పశుగ్రాసాలను 2:1 నిష్పత్తిలో అందించడం వలన పోషక పదార్థాలన్నీ ఏకకాలంలో లభ్యమవుతాయి. ధాన్యపు జాతి, పప్పుజాతి పశుగ్రాసాలను మిశ్రమ పంటగా సాగు చేయాలి. మిశ్రమ పంటల వల్ల పప్పుజాతి పశుగ్రాసాలు ముదిరినా నాణ్యత కలిగి ఉంటాయి. క్యాల్షియం వంటి ఖనిజ లవణాలు లభించి వరిగడ్డిలోని ఆక్సిలేట్లు విషపదార్థాల ప్రభావాన్ని నశింపచేస్తాయి.

పాడి రైతుకు ఎంతో తోడ్పాటు

పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే ప్రతి రైతుకూ పచ్చిమేత తప్పనిసరిగా సాగు చేయాలి. ప్రతి రైతూ తనకున్న పొలంలో పదో వంతు భూమిని పశుగ్రాసాల సాగుకు కేటాయించాలి. పశుగ్రాసాలు ఏడాదిలో 3 నుంచి 5 కోతలు వస్తాయి. నీటి సౌకర్యం ఉన్న సందర్భాల్లో బహువార్షిక గ్రాసాలు సాగు చేసుకోవచ్చు. పశుగ్రాసాల్లో ధాన్యపు జాతి, పప్పుజాతి అని రెండు రకాలుంటాయి. వీటిలో పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. కంకులు ఉండటం వలన పిండి పదార్థాలు లభిస్తాయి. పప్పుజాతి పశుగ్రాసాలు కాయలు కాస్తాయి. వీటిలో మాంసకృత్తులు అధికంగా ఉంటాయి. పచ్చిమేతను సమతులంగా అందజేయడం వల్ల పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటుగా ఉంటుంది.
– డాక్టర్ రమేష్, పశువైద్యాధికారి, చిన్నమండెం

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి

రాయచోటి టౌన్ : స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడిచి దేశాభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఎందరో వీరుల ప్రాణత్యాగాలతో నిర్మించిన మన దేశం మహోజ్వలంగా ఎదగాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో వరుసగా నాల్గోసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుగుచుండటం హర్షదాయకమన్నారు. రాయచోటి పట్టణంలో తక్కువ కాలంలోనే పోలీస్ పరేడ్ గ్రౌండ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు రూపుదిద్దుకొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్న తన కల కొనసాగుతుండటం సంతోషదాయకమన్నారు.

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ సమానంగా దక్కాలని, సామాజిక పరంగా, విద్యాపరంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను రాష్ట్రంలో తీసుకొచ్చారని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు.

యువతలో దేశభక్తి పెంపొందాలి


నందలూరు: 500 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ


రాజంపేట టౌన్: వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

రాజంపేట టౌన్ : హర్‌ఘర్ తిరంగా మహోత్సవంలో భాగంగా గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వంద అడుగుల జాతీయ జెండాతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ యువతలో దేశభక్తి పెంపొందేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడగలవన్నారు. యువతతోనే దేశ అభివృద్ధి సాధ్యం కాగలదని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను కట్టాలని చెప్పారు. బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు నాగోతు రమేష్‌నాయుడు, పోతుగుంట రమేష్‌నాయుడు, వివిధ విభాగాల కన్వీనర్లు హిమగిరినాథ్, పట్టుపోగుల ఆదినారాయణ, తోట రామయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ జాతీయ జెండాలను నిషేధించాలి

నందలూరు : ప్లాస్టిక్ జాతీయ జెండాలను నిషేధించాలని ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని సమాజ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి 500 అడుగుల భారీ జాతీయ జెండాతో జూనియర్ కళాశాల నుంచి అరవపల్లెలోని ఆర్ అండ్ బీ బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ జాతీయ జెండా ప్రాముఖ్యత కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అలానే ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని ఈ భారీ ర్యాలీ నిర్వహించినట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, సమాజ సేవా సమితి విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి ఎస్‌కే జావీద్‌బాషా, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మదనగోపాలస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : శ్రీ మదనగోపాలస్వామి, శ్రీ గణపతి స్వామి, శ్రీ సుబ్రమణ్యస్వామి, శ్రీ కృష్ణపరమాత్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని మదనగోపాలపురం గ్రామంలో 8వ తేదీ ఆదివారం నుంచి నేటి వరకు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ వేడుకలలో విగ్రహ ప్రతిష్టలతో పాటు శిఖర ప్రతిష్ట, ధ్వజ పంచాహ్నిక దీక్షా పూర్వక ప్రతిష్టలను నిర్వహించారు. అదే విధంగా హోమములు జరిపారు. ఈ వేడుకలలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి వెంట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, సీనియర్ నాయకులు కొండూరు విశ్వనాథరాజు, ఎంపీటీసీ ఎ.మధుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కుర్రా సుబ్బరాయుడు, శ్రీధర్, మల్లికార్జున రాజు, నాగరాజు, సిద్దయ్య, సురేష్, ఎల్లయ్య, ఎ.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదం అందజేశారు. 16వ తేదీ (శనివారం) శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు 10:30 గంటలకు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మదనగోపాలస్వామిల కల్యాణం కనుల పండువగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందిద్దాం


మున్సిపల్ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవి కుమార్

రాయచోటి టౌన్ : పురపాలక ప్రజలకు నాణ్యమైన సేవలు అందిద్దామని రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మున్సిపల్ కమిషనర్ జి.రవిబాబులు తెలిపారు. రాయచోటి నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన చైర్మన్ ఛాంబర్‌లో ఫయాజ్ బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. రాయచోటి మున్సిపల్ పరిధిలోని ప్రజలకు పారిశుద్య, తాగునీటి వంటి సేవలతో పాటు అన్ని రకాల పౌర సేవలు అందించేందుకు కృషి చేద్దామని తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్, కొలిమి చాన్‌బాషా, నాయకులు సలీం, సయ్యద్ రియాజ్‌లు పాల్గొన్నారు.

తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న జేఎన్ ఆంధ్రయ్య

చిట్వేలి : అన్యాయంగా తొలగించిన దివ్యాంగుల పింఛన్‌లను వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్ర దివ్యాంగుల పింఛన్‌దారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎన్ ఆంధ్రయ్య డిమాండ్ చేశారు. 1984లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి పింఛన్ పొందుతున్న నిజమైన పింఛన్ దారులను తొలగించడం అన్యాయమన్నారు. గురువారం ఆయన చిట్వేలిలో విలేకరులతో మాట్లాడుతూ వైద్యబృందం నిర్లక్ష్యంగా వైద్య పరీక్షలు చేసి ఫించన్ దారుల తొలగింపునకు కారణం అయ్యారని ఆయన ఆరోపించారు. వైద్యులతో పనిలేకుండా గ్రామ పంచాయతీ, మండల అధికారులు నిజమైన దివ్యాంగులను గుర్తించి తొలగించిన ఫింఛన్‌లను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు నరసింహరాజు, సుబ్బరాయుడు, శంకరయ్య, దివ్యాంగులు పాల్గొన్నారు.

చిన్ని కృష్ణయ్యల ముందస్తు సందడి


నందలూరు: శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు


రాయచోటి టౌన్: రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు


రాజంపేట రూరల్: ఉట్టి కొడుతున్న విద్యార్థులు


రాజంపేట రూరల్: శ్రీకృష్ణపరమాత్మ జన్మదిన ముందస్తు వేడుకలలో చిన్నారులు

నందలూరు : మండలంలోని శ్రీ అన్నమాచార్య అకాడమీ హైస్కూల్‌లో శ్రీ కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు నిర్వహించారు. గురువారం ఉదయం చిన్నపిల్లలను వారి తల్లిదండ్రులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలతో పాఠశాలకు తీసుకువచ్చారు. శనివారం శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకుని పాఠశాల కరెస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్, డైరెక్టర్ మాడపూరి హేమలత పర్యవేక్షణలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పాటలు, నృత్యాలు, ఉట్టి కార్యక్రమాలు నిర్వహించారు.

రాయచోటి టౌన్ : మన సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని రాయచోటి నారాయణ స్కూల్ ఏజీఎం శంకర్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటిలోని ఆ పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణామి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషాధారణలతో ఆకట్టుకున్నారు.

రాజంపేట రూరల్ : కృష్ణాష్టమి ముందస్తు వేడుకలను రాజు హైస్కూల్ 2 బ్రాంచిలలో గురువారం సీఈఓ గుంటిమడుగు రఘురామరాజు, ప్రిన్సిపల్ వి.మోహనరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు. విద్యార్థుల సత్యభామ, శ్రీకృష్ణపరమాత్మని వేషధారణలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా చిన్నారులు ఉట్టి కొట్టే ఉత్సవం అలరించింది. ఇదే సమయంలో చిన్నారులు చేసిన నృత్యాలు ఉత్సాహంను నింపాయి. అనంతరం కృష్ణాష్టమి విశిష్టతను సీఈఓ, ప్రిన్సిపల్‌లు విద్యార్థులకు వివరించారు.

దళిత కాలనీకి దారి సౌకర్యం కల్పించండి

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రం సమీపంలోని వైఎస్సార్ దళిత కాలనీకి దారి సౌకర్యం కల్పించాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.మహేష్, సీపీఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు కోరారు. గురువారం కాలనీలో పర్యటించిన వారు దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ 2006, 2007వ సంవత్సరంలో నాటి ప్రభుత్వం దళితులకు సర్వేనెంబరు–713లో రెండు ఎకరాల, 80 సెంట్లలో 90 నివాస స్థలాలు కేటాయించారు. ఇందులో దాదాపు 35 మంది నివాసాలు ఏర్పరుచుకొని నివసిస్తున్నారని, కానీ ఎటువంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో దళితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పక్కనే ఉన్న సర్వేనెంబరు. 714లోని వ్యక్తులు ఈ వైఎస్సార్ దళిత కాలనీకి దారిలేకుండా 713 సర్వే నెంబర్లు గల భూమిని కూడా కలుపుకొని దళితుల ఇల్లు కనబడకుండా ప్రహరీ గోడను నిర్మించి దళితులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి వైఎస్సార్ దళిత కాలనీ దారి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

వర్షపునీటిని భూమిలో ఇంకింపజేయాలి

పెనగలూరు : వర్షపునీటిని భూమిలో ఇంకే విధంగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ అమరేశ్వరీ తెలిపారు. గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్సు అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నీటి సంఘం అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సంబంధించి ఊట కాలువలు, చెరువు కాలువలు తయారు చేసేందుకు ఎక్కడెక్కడా అవసరమో తెలియజేయాలన్నారు. అలాగే కాలువల్లో పూడిక తీసి వర్షపునీరు భూమిలోకి ఇంకేటట్లు చేస్తే నీటిశాతం పెరుగుతుందని ఆమె తెలియజేశారు. అలాగే పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్, నీటి సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్నానది

సిద్దవటం : మండలంలో పెన్నా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నా నదిపై ఉన్న లోలెవల్ కాజ్‌వే మీదుగా వరదనీరు ప్రవహిస్తోందని ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లోతట్టు గ్రామాలైన జ్యోతి, వంతాటిపల్లె, ఎస్.రాజంపేట, జ్యోతి గొల్లపల్లె, ఆకుల వీధి, గాండ్లపాలెం తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చేపలు పట్టేవారు నదిలోకి వెళ్లవద్దని ఆయన హెచ్చరించారు.

దృష్టి సారించండి.. ప్రమాదం తప్పించండి


మార్కెట్ వద్ద ప్రమాదకరంగా ఉన్న భారీ వృక్షం

రాజంపేట టౌన్ : పట్టణంలోని మార్కెట్ వద్ద ఓ భారీ వృక్షం నేలకొరిగే స్థితిలో ఉంది. ఓ మోస్తరు గాలి వీచినా ఆ వృక్షం ఉన్నఫళంగా రోడ్డుమీద పడుతుంది. రాజంపేట పట్టణంలో మార్కెట్ ప్రాంతం ప్రధానమైనది. ఈ మార్గం ద్వారానే కడప – తిరుపతి మధ్య ఆర్టీసీ బస్సులు, వందలాది ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే మార్కెట్ కావడంతో నిత్యం పెద్దసంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఆ చెట్టుకింద నీడ ఉండటంతో తోపుడు బండ్లలో పలువురు వ్యాపారాలు సాగిస్తుంటారు. అందువల్ల ప్రజలు తోపుడు బండ్ల వద్ద తమకు కావాల్సిన పండ్లు వంటివి తీసుకుంటుంటారు. అయితే ఈ భారీ వృక్షం గాలివీచి నేలకొరిగితే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉంది. అధికారులు ఎలాంటి ప్రమాదం జరగకముందే వృక్షాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.











